


ఆ వీధిలోకి ఒక కొత్త సంసారం వొచ్చింది. ఏమంత పెద్దకుటుంబం కాదు. ఒక అత్త మొగుడు, పెళ్లాం, ఒక కుక్క - అంతే! పక్కింటి పుల్లమ్మత్త, పొరిగింటి గైరమ్మొదిన, దొడ్డేపు మంగమ్మప్ప కొత్తగా వచ్చినవాళ్లకి స్వాగతం చెప్పారు. కాని ఈ వచ్చిన కొత్తకుక్కని చూసి ఆ వీధి కుక్కలు ఒక్కటిగూడ ఆహ్వానించలేదు సరిగదా, మంచీచెడ్డా లేకండా ఒకటే మొరగడం!

సామానంతా యింట్లో సర్దేసుకొన్న తర్వాత అరుగుమీద తీరుబడిగా అత్తా కోడలు కూచొని పేలు నొక్కుకొంటున్నారు. పుల్లమ్మత్త నవ్వుకొంటూ వాళ్ల పక్కకివచ్చి కూచొంది.

"మా కోడలు పేరేవిఁటో?" అని ప్రశ్నించింది.

"సుగుణమ్మా" అని అత్త తన కోడలు పేరుని గర్వంగా చెప్పుకొంది.

అంతలో మంగమ్మప్ప కొస్త జునుబాలు తెచ్చి, పేలు నొక్కుతున్న సుగుణకి యిచ్చింది.

సుగుణ ఆ జునుబాలని గభుక్కున లేచి అందుకోలేదు. తల కొస్త పక్కకి తిప్పి గలాసులో పాలకేసి గడియసేపు చూసి, మంగమ్మప్పకేసి చిరునవ్వునవ్వుతు, ఏవిఁటిదంతా అన్నట్టు చూసింది.

"జునుబాలు చెల్లెమ్మా. మీ కోసం, మరిదిగారికోసం తెచ్చాను. ప్రొద్దుట మీరు రాకముందు మా ఆవీనింది. పొద్దుటపాలు కుడితిలో పారబోసి, తర్వాత పిండినపాలు కనకమ్మపిన్నికి, పాపయ్యొదినకి, గైరమ్మత్తకి, మునసబుగారికి కొసిని కొసిని చొప్పున యిచ్చి యివి మీకు తెచ్చాను" అంది. ఆ గలాసు ఆ పక్కనపెట్టి, గోడకి చారబడింది.


పుల్లమ్మత్త ముఖంలో అప్పుడే కొస్త ఈర్ష్య మెదిలింది. తనకంటె మంగ వాళ్లదగ్గర మంచయిపోతోందని. తనుగూడ మంగ కంటె ముందుగా ఏదైనా యినాం తెచ్చి ఉన్నట్టయితే వాళ్ల స్నేహం తను దానికంటె ముందుగా సంపాయించి వుండేది. పోనీ యిప్పటికయినా ముంచుకపోయిందేవీఁ లేదు. తన చిన్న బుల్లోణ్ణి ఎత్తుకుని వచ్చిందా; సుగుణకి పిల్లలు ఎలానూ లేరు గాబట్టి యిక వాణ్ణి వొదలదు. వాడూ బొజ్జిగా, అందంగా వుండటంవల్ల, వాణ్ణి చూడగానే గభుక్కున ఎత్తుకుంటుంది. అలా తనే మంగమ్మకంటె వాళ్లకి దగ్గరయి పోతుంది. ఈ భావం మదిలో మెదలగానే, పుల్లమ్మ లేచి చంటాడు లేచి ఏడుస్తుంటాడు, వాణ్ణి తీసుకొస్తానంటూ లేచింది. ఆ మాట అంటూనే సుగుణని కుతూహలంగా కనిపెట్టింది. సుగుణ నవ్వుతూ తలెత్తి చూడగానే, తన పాచిక పారుతుందని గబగబావెళ్లిపోయింది.

"జునుబాల్లో బెల్లం కంటె పంచదార కోసుకొంటే ఇక ఆ రుచి దాండే ... ఏమమ్మా చెల్లెమ్మా ఇంతవరకూ మరిదిగారి పేరే చెప్పలేదు. ఏం పేరో చెబితే కొరుక్కు తినేస్తావాఁ?" అంటూ సుగుణ చేతిలోని పైనని లాక్కొని, అత్త తలని దువ్వడం మొదలు పెట్టింది మంగమ్మ. సుగుణ భర్త పేరు చెప్పలేక సిగ్గుగా తలొంచుకొంది.

"చెప్పు సుగుణా సిగ్గెందుకు? పెళ్లయి ఏ పదేళ్లో అయింది. ఇంకా వాడిపేరు చెప్పడానికే సిగ్గయితే ఎలా?" అంది అత్త.

"పిల్లలులేరు గాబట్టి యింకా మా చెల్లెలి కొత్తపెళ్లి కూతురే నత్తా" అంటూ ఒక పేని తీసి రెండు బొటన వేళ్లమధ్య పెట్టి 'స్' అని నొక్కింది.

బయట కుక్కలన్నీ సమయాసమయాలు తెలుసుకోకండా ఊరికే అరుస్తున్నాయి. కొన్ని సుగుణ కుక్కని చూసి చాతగాక ఏడుస్తున్నాయి గూడ. అసలా వీధికి కొత్త కుక్క రాగానే 'బొంయ్' మని అరిచాయి. ధైర్యం చాలక దూరం నించే మొరిగాయి. ఇప్పుడు గూడ స్థంభానికి కట్టిన కుక్కని



చూసి చేతగాని అరుపులు అరుస్తున్నాయి. ఆ వీధి కుక్కలన్నీ.

"అబ్బబ్బ! ఈ వీధి కుక్కలకి కాస్త గూడ బుద్ధిలేదు. కొత్తకుక్క వస్తే అదే మొరగడం. మళ్లా ఎవరయినా నిజంగా దొంగలుపడితే అసలు కిక్కుమెక్కు మనవ్. దొంగచాటుగా యిళ్లల్లోకి చొరబడి అన్నాలు బుక్కేస్తాయి. ఛీ, ఛీ" అంటూ గైరమ్మొదిన వచ్చింది.

సుగుణ ఆ గ్రామీణుల చొరవకి, స్నేహానికి, ప్రేమకి ఎంతో ముచ్చట పడింది. అలా కలసిమెలసి ఒకచోట సరదాగా కబుర్లాడుకొనే జీవితంవుంటే ఎంత హాయిగా వుంటుంది!

"ఏమిటండీ?" అని ప్రశ్నించింది సుగుణ గైరమ్మొదిన్ని.

చంకలోని చంటాణ్ణిదింపి గైరమ్మొదిన సుగుణ పక్కకి వచ్చింది: "ఈ వీధి కుక్కలమ్మ. ఛీ ఛీ, ఊరకుక్కలే అన్నీ, ఒక్కటిగూడ జాతికుక్క లేదు. మన కుక్కనిచూసి ఒకటే మొరగడం. మీ కుక్క అసలు వాటి మొరుగుల్ని లెఖ్ఖచేయకుండా దర్జాగా రాజాలా కూచొనివుంది."

"కొత్తకదూ, అలానే పోట్లాడుకొంటాయి. అలవాటయితే అవే కలుసుకొంటాయి" అంది అత్త.

అంతలో పుల్లమ్మత్త కొడుకు నెత్తుకొని వచ్చింది. ఇంటికెళ్లి పడుకొన్నవాడిని బలవంతాన లేపుకొచ్చింది. పిల్లాడు చూడ్డాకందంగానే వున్నాడు. కాని తన కొడుక్కంటే ముందుగా, గైరమ్మ తీసుకొచ్చిన బూచిగాడు సుగుణ ఒళ్ళోకి, ముద్దుల్లోకి వెళ్లిపోయాడు. ,వాడేం అందంగా వుంటాడు, చీవిండిముక్కువాడూ. తన కొడుకుని చూసిందంటే సుగుణ గైరమ్మ కొడుకుని వొదిలేస్తుంది—అనుకొంటూ పుల్లమ్మ తన కొడుకుని తీసుకొచ్చి సుగుణకి అగుపించేలా ముందుకి తోసింది.

సుగుణ, పుల్లమ్మ కొడుకుని చూడగానే బూచిగాణ్ణి అవతలికి నెట్టెయ్యలేదు. ఇద్దర్నీ

(46-వ పేజీ చూడండి)

# అంతరం

(౪-వ పేజీ తరువాయి)

దగ్గరకి తీసుకొని ఆడించింది. మంగమ్మ ఒక్కర్తే సుగుణ ఈడుదిగాబట్టి యిద్దరికీ బాగా జత కుదిరింది. పుల్లమ్మత్త, గైర మొహ్మదినా అత్తతో లోకాభిరామాయణం మొదలుపెట్టారు.

సాయంకాలం కాగానే ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు. సుగుణ జున్నుపాలు తీసి పంచదార కలిపి జున్ను చేసింది. చేసింది భర్తకి కాస్తతీసి వేరేగావుంచి వాకలి పూడ్చుకొంటున్న పుల్లమ్మత్తకి కాస్త రుచి చూపించింది. భలేబాగా వొండుతావు కోడలా నువ్వు అని ఒకటే పొగడ్డం!

రాత్రికి భర్త, జగన్నాథం వచ్చిం తర్వాత, సుగుణ ఆ గ్రామస్త్రీల గురించి ఒకటే మెచ్చుకొని చెప్పింది. పల్లె ప్రజల మధ్య నివశించడం సుగుణకి కొత్తగాని, జగన్నాధానికి మాత్రం ఏమీ కొత్తకాదు. ఆమె చెప్పిన మాటలు చిరునవ్వు నవ్వుకుంటూ విని, భోజనాలయిన తర్వాత కుక్క, 'రాము'ని తీసుకొని కిళ్లీకోసం బయలుదేరాడు.

కిళ్లీకొట్టు చేరువలోనేవుంది. కొట్టు లోపల చిన్న కిరసనాయిలు బుడ్డి వెలుగుతోంది. బయటవున్న బెంచీ బల్లమీద రావణ్ణ మావ, జగ్గయ్యన్న, సోమప్ప నాయుడు, వీర్రెడ్డి, పోలయ్యబావకూచొని కులాసాకబుర్లు చెప్పుకొంటున్నారు.

జగన్నాథం కుక్కని తీసుకొని కొట్టు దగ్గరికొచ్చి మితాయి కిళ్లీ ఒకటిమ్మన్నాడు. కొట్టు అబ్బి కాసేపు ఆ కొత్త ముఖాన్ని పరికింపుగా చూసి, తర్వాత ఆకులు తీశాడు కిళ్లీకట్టడానికని. పోలయ్యబావ నోట్లోంచి చుట్టతీసి తుపుక్కున పక్కకివూసి, నిలబడి జగన్నాథం దగ్గరకి వచ్చాడు.

"మీరే కదండీ ఇయ్యాదికి కొత్తగా వచ్చారు?" అని అడిగాడు.

"అవునండి" అని తిరిగి జగన్నాథం సమాధానమిచ్చాడు.

"ఇంతక ముందెక్కడుండేవోళ్లండీ?" అంటూ వీర్రెడ్డి దగ్గరికొచ్చాడు.

"రాజమండ్రిలో"

రావణ్ణ మావ లేచి, పని గు[illegible], సోమప్ప నాయుడు పిల్లల గురించి అ[illegible]రు జగన్నాథం అన్నిటికీ నవ్వుకుంటూ సమాధానం చెప్పాడు. పోలయ్య బావ, "అరె మీ రిట్టా నిలబడే వున్నారు, కూకొని మాటాడండి" అని తన స్థలంలోకి ఆహ్వానించాడు. ఆ ఒక్క పావుగంటలోనే జగన్నాథం వాళ్లల్లో పూర్తిగా కలిసిపోయాడు. తను ఆ గ్రామంలో ఎంతో కాలంనుంచి కాపురమున్నంత కలవడిగా, సన్నిహితముగా మాటాడాడు.

జగన్నాథం కుక్కని చూసి మళ్లా వీధి కుక్కలు పోగయి అరవడం మొదలు పెట్టాయి. జగన్నాథం కుక్కగూడ ప్రతి సవాల్ చేస్తున్నట్టు రెండుమూడు మాట్లు 'బంయ్' మంది. జగన్నాథం 'ఏయ్, రామూ' అనే మందలించగానే యిక అరవకండా, అరుస్తున్న ఊరకుక్కల కేసి చురచుర చూస్తోంది.

కిళ్లీకొట్టు సూరయ్య మితాయికిళ్లీ బాగా సావాఁనేసి కట్టిచ్చాడు. జగన్నాథం కిళ్లీ అందుకోవాలని లేస్తుండగా వీర్రెడ్డి లేచి, అది అందుకొని అతనికిచ్చాడు. కిళ్లీ అందుకొని జగన్నాథం డబ్బులివ్వబోతే సూరయ్య "ఎందుకు లేండి" అంటూ ఆడబ్బుల్ని తీసుకోలేదు.

"మంచిజాతి కుక్కండి. ఎక్కణ్ణించి తెచ్చారు?" అంటూ రావణ్ణ మావ 'రాము'ని విజలేస్తూ చిటికలేశాడు. 'రాము' తోకాడించింది. కుక్కలకిగూడ 'రాము' అనే పేర్లున్నవని వినడం సోమప్ప నాయుడికిదే మొదటిసారి. చిత్రంగా కుక్కకేసి చూస్తున్నాడు. కాసేపు ఏవేవోమాటాడుకొన్న తర్వాత జగన్నాథం అందరికీ నవ్వుకొంటూ నమస్కారాలు చేసి వెళ్ళిపోడానికి నుంచున్నాడు.

"ఎంతపని ఎంతపని చేశారు! మీలాంటి పెద్దింటోళ్లు మాలాటోళ్లకి చెయ్యెత్తి దణ్ణం పెట్టడం...?" అంటూ గబుక్కున జగ్గయ్యన్న, పోలయ్యబావ, వీర్రెడ్డి నిలబడి వారించారు.

"ఫర్వాలేదండి. పెద్దలకి నమస్కారం చేస్తే ఆయుషు వృద్ధవుతుందంటారు..." అని నవ్వుకొంటూ జగన్నాథం 'రాము' ని తీసుకొని బయలుదేరాడు. వీధికుక్కలన్నీ అరచుకొంటూ 'రాము' వెనకాలే బయలుదేరాయి. 'రాము' రాజఠీవితో ఆ ఊర కుక్కల మొరుగుల్ని లెక్కచేయకండా యజమాని వెనకాల విలాసంగా నడచింది.

"ఛెఛెయ్" అంటూ కుక్కల్ని తిట్టి, నాలుగు బెడ్డల్ని సోమప్పనాయుడు ఊరకుక్కలకి విసిరాడు. ఒక కుక్కకి ఒక బెడ్డ తగిలి 'కుంయ్' మన్నా మిగతా కుక్కలు మాత్రం మొరగడం మాన్లేదు.

"కుర్రోడయితే పోయాడుగాని, మంచి యినయం, బుద్ది, గ్యానం వుందోయ్ అతగాడిదగ్గర. మంచి కలుపుగోరుమనిషే. రేపటికి మంతో కల్సిపోతాడు పూర్తిగా" అంటూ జగ్గయ్యన్న జగన్నాధాన్ని పొగిడాడు.

"ఎలాగయినా చదువుకొన్నావోళ్లు తరహాయేవేరు. అసలలా ఎలిపోయేప్పుడు దణ్ణం మనకిపెడతాడని అనుకొన్నావా? అదంతా చిన్నప్పణ్ణించి అబ్బిన మంచిబుద్ధులు. మనూరు పిల్లలూవున్నారు, ఎందుకు పెంకి డిప్పకాయల్లా!... తే అగ్గిటు దే..." అంటూ వీర్రెడ్డి జగ్గయ్యన్న దగ్గ చుట్టతీసి, తన చుట్ట వెలిగించుకొన్నాడు.

నెలరోజుల్లో జగన్నాథం ఆ గ్రామీణుల్లో పూర్తిగా కలసిపోయాడు. సుగుణ గూడ అలానే సరదాఅయిన మనిషి గాబట్టి పుల్లమ్మత్తలాంటి ముత్తైదువలదగ్గర్నుంచి పార్వతిలాంటి పిల్లలవరకూ పూర్తిగా వాళ్ళల్లో కలసిపోయింది. పుల్లమ్మత్త అప్పుడప్పుడు ఊరగాయపచ్చడి, ఉల్లిపాయ పులుసు లాంటి వంటకాలు తెచ్చి రుచిచూపిస్తోంటే మంగమ్మప్ప పూరికే అప్పుడప్పుడు. పాలు, పెరుగు, నెయ్యి కొంచం కొంచం తీసుక వచ్చేది. గైరమొహ్మదిన ఏవీఁ యివ్వలేని బీద గాబట్టి అప్పుడప్పుడు లవకుశల పదం పాడుతూ అత్తస్నేహాన్ని బాగా చూరగొంది. ఇంకా ఆ వీధి ఆడవాళ్లందరు సుగుణ స్నేహంకోసం, ఆమెతో మాటాడ్డం కోసం తహతహలాడిపోయేవారు.

ఇక జగన్నాథం ఏవీధిలోంచివెళ్లినా ఈతిగాడి దగ్గర్నుంచి, రావణ్ణమావ వరకూ దణ్ణాలుపెట్టడం, కుశలప్రశ్నలడగడం. అప్పుడప్పుడు. పోలయ్యబావ జగన్నాథంతో ఆసికాలాడుతూ గేదిమార్క సిగరెట్టు కాల్చమని యిచ్చేవాడు. అప్పుడే కొంతమంది జగన్నాధాన్ని వరసగూడ కలుపుకొన్నారు. చదువుకొన్నవాడు గాబట్టి గ్రామీణులు ఏ నోటు రాయించవాలన్నా, ఏ వుత్తరంముక్క చదివించుకోవాలన్నా, సలహాలు కావాలన్నా జగన్నాథం చుట్టూ చేరేవారు. కొంతమందయితే జగన్నాథం హాస్యపుమాటలు వినాలని సూరయ్య దుకాణందగ్గర రాత్రిఎనిమిదినించే పోగయేవారు. అతను రాగానే, అతన్ని అందరిమధ్యా కూచోబెట్టుకొనేవారు.

ఇక జగన్నాథం జాతికుక్క 'రాము'ని చూస్తే ఆ గ్రామంలో ఒక్క కుక్కకిగూడ పట్టంలేదు. 'రాము' వీధిలో కొస్తేచాలు అనికుక్కలు ఒక్కసారిగా 'బంయ్' మనడం; 'రాము' వాట్లని లెక్కచేయకండా ముందుకుసాగిపోతే, చాలక అవీ వెనక[illegible] పడేవి. 'రాము' వెనక్కి తిరిగిందా, మళ్లా ఒక్కదానికీ ఎదురుగానిలబడి అరవటానికి గుండెలు లేవు. కొన్ని తెగించి మీదకురి

కిరా 'రాము' కోరలు చూడగానే పలాయనం చిత్తగించేవి. 'రాము' పడుకొని వున్నా అవి మొరగడం మానేవికావు. వాట్లకసలు బుద్ధనేదే లేదు. కొత్తగా ఆ ప్రదేశానికి తమలాంటి జతువే ఒకటి వస్తే దాన్ని ఆదరంగా ఆదరించాలనే జ్ఞానం వాట్లకి కొస్తన్నా లేదు. వచ్చిరాగానే కోరలు చూపించి యుద్ధాలకి సవాల్ చేస్తాయి. ఆ కొత్తకుక్క ఎంత తప్పుకతిరిగినా, దాన్ని అసలు అవి వొదలనే వొదలవు. తానివాసన తగిలేచాలు 'కంయ్, భొంయ్' మంటూ మొరుగుతాయి. పోనీ ఒక్కసారిగా దాన్ని చంపెయ్యడానికి, వాటికి ధైర్యం చాలదు.

అలానే గడుస్తున్నాయి రోజులు. ఇప్పటికి సరిగా రెండేళ్లు గడచాయి. మధ్యాహ్నంపూట సుగుణఅరుగుమీదికి ఒక రెండేళ్ల క్రితం గుమిగూడే సంతమంది యిల్లాళ్లు యిప్పుడు గుమిగూడటం లేదు. అసలు అక్కడికి రావడమే లేదు. సుగుణ బియ్యం చేటలో వేసుకొని అరుగుమీద కూర్చుంటే యింతకముందు ఆమె పిలవకపోయినా పదిమందీవచ్చి తలో కాస్త బియ్యంబాగు చేసేవారు. కాని యిప్పుడామె పిలుస్తున్నా ఎవరూ వినిపించుకోవడం లేదు. ఏదో, ఎక్కడో పనుందంటూ వెళ్ళిపోయేవారు.

ఇప్పుడు వీళ్ళంతా పుల్లమ్మత్త అరుగుమీద మఠం వేశారు. అష్టాచెమ్మ ఆడుతూ ఆ వూళ్లోవూసులు ఏ యిల్లాలో ఎత్తేది; గభుక్కున గైరమ్మొదిన సుగుణ పేరుని సూచించేది.

“చాలమ్మాచాలు; చిత్రాంగి ఎంతకయినా తెగును. అత్తమెత్తం దవబట్టి ఆడింది ఆట, పాడిందిపాటగా సాగిపోతోంది. మొగుడుగూడఅలాంటివాడేగాబట్టి పెళ్లంమాట లెత్తుకొని తల్లిని నానామాటలు అంటుంటాడు. పాపం! ఆవెఁ, యింకేం చేస్తుంది, అన్ని తిట్లూ తింటూ ఆ యింట్లోనే, కోళ్లేసే అంటు మెతుకులు తింటూ వుంటోంది.”

అంతలో పుల్లమ్మత్త గవ్వల్ని విసుర్తూ, గైరమ్మొదిన చెవిదగ్గరకి వంగివూదేది; “దేవఁన్న తక్కువదా? చవఁత్తకార్తి. అలాంటి దొంగముండ కాబట్టే దానికి అలాంటి, బాగాఅణిచేసే వోళ్లు దొరికింది. మొన్న మా చంటాడుమెళ్లో గొలుసు దొంగతనం చేసేసింది. నేను సరిగ్గా ఆనవఁయాని కక్కడికి ఎళ్లబట్టి దొరికిపోయింది...”

అలాంటి దొంగముండ గాబట్టే దాని కొడుక్కింకా పిల్లలు కలగటం లేదు” అని నిట్టూర్చేది పోలమ్మ.

“అబ్బ అలా అనగానే గ్యాపకం వొచ్చింది. అది, ఏది, సుగుణలేదూ, మనరావిఁగాణి గుమ్మంలోంచితొంగితొంగి చూస్తోంది. ఆడుగూడ దానికేసిచూసి నవ్వడం, యికిలించడం...” అనేది రహస్యంగా ఎర్రమ్మ.

“ఈ పాపం ఎప్పటికయినా బద్దలవకండా వుంటుందేంటి, నేను చూస్తానుగా” అనేది ఈరమ్మ పిక్కనవ్వుతూ.

ఈ సమావేశంలో వాళ్లికి ప్రతీదీ విచిత్రంగానే అగుపించేది. ఆ యిచిత్రాన్ని, యిద్దూరంగా చెప్పుకొనేవారు. వాళ్లి కుక్కకి 'రాము' అనే పేరు పెట్టుకొన్నారట “చానమ్మాచాన. ఎక్కడా దేవుఁడి పేరు కుక్కలకి పెట్టుకోటం నేను చూళ్లేదు” అనే ఆశ్చర్యం! సుగుణకి పిల్లలు లేరట, ఇక ఆమెగురించి ఒకటేచర్చ.

ఈ సంగతులన్నీ సుగుణకి మొదట్లో చూచాయిగా తెలిశాయి గాని, వాట్లని ఆమె నమ్మలేదు. కాని ఒకనాటి వెన్నెల రాత్రి వెనకింట్లో పుల్లమ్మత్త బొకబొకలు వినిపించగానే సుగుణచెవిని అలా సారించింది. ఆ మాటలని విని అలా నీరయిపోయింది. ఆ స్థితిలో ఆమెకళ్లనించి బొటబొట నీళ్లు గూడ కారిపోయాయి. మంచం మీద పడి వెక్కివెక్కి ఏడ్చింది. తన తమ్ముడులా చూసుకొంటున్న రావుఁడుకి తనకీ ఏదోవున్నట్టు వూసులాడుకొంటున్నారు!

సాయంకాలమవగానే జగన్నాధం స్నానం చేసి, భోజనమయిన తర్వాత అలవాటుప్రకారం సూరయ్యకొట్టుకి బయలుదేరేవాడు. సూరయ్య యింతకముందులా అతన్ని 'మీరు' అని గౌరవంగా పిలవడం మానేశాడు. 'ఏవఁయ్యా' అనే జేరంలోకి దిగాడు. ఇదిగాకండా వాడి డబ్బు ఎత్తుకపారిపోతున్నట్టు, జీతం యింకా నాలుగు రోజులకి అందుతుందనగా “ఏవఁయ్యా, జగన్నాధం! నా బాకీ ఏదీ?” అని నిలదీసి అడిగేవాడు.

ఇప్పుడు యింతకముందులా వీరిరెడ్డీ చుట్టలివ్వడం లేదు. ఎంతో ఆప్యాయంగా, ప్రేమ కారిపోతున్నట్టు మాటాడే రావఁన్న గూడ సరిగా మాటాడ్డం లేదు. తనే ఎప్పుడయినా పలకరిస్తే, నోరుకదిపేవాడు. ఒక్క జగ్గయ్యతప్పితే మిగతావాళ్ళెవరు తను కదిపితేగాని కదిలేవాళ్లు కారు!

ఒకనాటిరాత్రి జగన్నాధం భోంచేసిన తర్వాత మామూలుగా కిళ్లీకొట్టుదగ్గరకివచ్చి సూరయ్యని ఒక కిళ్లీ యిమ్మన్నాడు. సూరయ్యసలు అతనిమాటలు వినుపించుకోనట్టే ఏవోపద్దులు రాసుకొంటున్నాడు. జగన్నాధం కాసేపయిన తర్వాత మళ్లీ అడిగాడు. సూరయ్య కసిరినట్టు మాటాడాడు:

“ఇక నే నివ్వలేనయ్యా. ఇప్పటికే ఆ రూపాయల పద్దు పెరిగిపోయింది. క్రితం నెల యిస్తా నిస్తానని ఎగనామం పెట్టావ్. ఇప్పుడుగూడ అలానే చేస్తావ్. నే నసలు ఒక దమ్మిడీ అరువియ్యనిక. ఆ బాకీ అంతా పైసలా చేసుకొంటే తర్వాత చూసొచ్చు” అన్నాడు దూకుడుగా.

జగన్నాధం ముఖం మాడిపోయింది. క్రితం నెల సూరయ్య బాకీ యిచ్చేయవలసిందే కాని తల్లికి జబ్బు చేయడం వల్ల ఆ కాస్త డబ్బు మందులకీ మాకులకీ అయిపోయింది...సరె యిక నేం చేస్తాడు, మాటాడకండా వెనక్కి తిరిగిపోయాడు.

నాలుగడుగులు ముందు కేసేసరికి ఈరిగాడి మాటలు వినిపించాయి: “చానా పెద్ద మనిషనుకొన్నాం గాని ఆ ఈదిలో ఆడంగులందకీ కన్ను కొట్టడవేఁ”

కన్ను కొట్టడవేఁ కాదు, సారన్న పెళ్లం మంగ లేదూ, దాన్నిగూడ మరిగాడు. ఈ చాటురం కన్నాళ్లు దాగుతుందేంటి? ఎప్పుడోప్పుడు పొక్కక మానుతుందా, అప్పుడు ఎదవ పక్కటెముకలు యిరక్కతప్పుతాయా?” అంటూ మీసం తిప్పాడు వీరిరెడ్డి.

జగన్నాధం అడుగులు మరింక ముందుకి సాగలేదు. వీరిరెడ్డిని అమాంతంగా పీక నొక్కేయాలన్నంత ఉద్రేకి అయిపోయాడు గాని, వెంటనే తమాయించుకొని వెనక్కి చూడకండానే కోపంగా ముందు కడుగు లేశాడు. వెనకనించి వెటకారపు నవ్వులతన్నింకా బాధించాయి......వీధిమలుపు తిరగ్గానే జగన్నాధం అడుగులు కాస్త మెల్లబడ్డాయి. ఉద్వేగంగూడ కాస్త తగ్గింది గాని ఆరాటం మాత్రం తగ్గలేదు. తను ఆ గ్రామానికొచ్చి యిప్పటికి సరిగ్గా రెండేళ్లు కావస్తోంది గాని, ఆ వీధి ఆడవాళ్ల ముఖాలే సరిగా తెలీవు. ఇక మంగమ్మ రోజూ తనింటికి వస్తున్నా తనెప్పుడూ ఆమెని కన్నెత్తి చూడలేదు. ఒకసారి ఆమె వుత్తరం చదివేసుని వస్తే ఏదో పనుందనే వంకమీద బయటికి వెళ్లిపోయాడు. అంత సిగ్గు స్త్రీలంటె! అలాంటి తనకి, తన చెల్లెలులాంటి మంగమ్మకి సంబంధం పెట్టారు. అప్రయత్నంగా జగన్నాధం కళ్లు చెమ్మగిల్లినై.

ఇంటికి చేరుకొనేసరికి 'రాము' బయట వెన్నెల్లో ఆ వీధికుక్కలన్నిటితో కలిసి సరసాలాడుకొంటోంది. ఒకదానిమీదొకటి పడి సరదాగా కరచుకొంటున్నాయి. అక్కడి కుక్కడే పారిపోవడం, తిరిగి వెనక్కి వచ్చి పళ్లతో మెల్లగా కొరుక్కోవడం - ఎంత ఆనందంగా గెంతు

తున్నాయి! అనుకొంటూ జగన్నాథం 'రాము' దగ్గరగా వచ్చాడు. యజమానిని చూడగానే 'రాము' తోకాడించుకొంటూ మీది కెగబాకిపోయింది. నేలమీద కాళ్లు చాపి తన ప్రేమని వ్యక్తం చేసేట్టు సన్నగా అరచింది. దాన్ని చూసి మిగతా కుక్కలు గూడ జగన్నాథం చుట్టూ చేరాయి. చుట్టూ చేరిన కుక్కల్ని చూడగానే 'రాము' తిరిగి యజమాన్ని నొదిలి వెనక్కి పరుగెత్తింది. మిగతా కుక్కలన్నీ 'రాము'ని వెంబడించాయి. అది వాటికి ఓ 'మూగ దొంగాట'!

జగన్నాథం కుక్కల అమాయక స్నేహానికి ఒక నిట్టూర్పు విడిచి లోలోనే నవ్వుకొన్నాడు. నోరు లేకపోయింది గాని, నిజంగా అవి ధన్యులు; జంతువులయితే అయాయి గాని వాళ్ల కేరింతాలు నిజంగా స్వర్గసేథాలు - అనుకొంటూ ఆ కుక్కల గంతుల్లో తన మానవ హృదయాన్ని కాసేపు హాయిగా విసిచిపెట్టేశాడు.

మొదట్లో అవి ఒకదాన్ని చూసి మరొకటి కోరలు చూపించుకొన్నాయి, అరచాయి, మొరిగాయి, కొన్ని సమయాల్లో మీదపడి కరచుకొన్నాయిగూడ! కాని కాలం జరుగుతున్న కొద్దీ వాటివైరం కొత్త కొత్త చొప్పున తగ్గి, మెల్ల మెల్లగా దగ్గరకి చేరుకొన్నాయి. స్నేహితులయ్యాయి. వాటి భాషలో మాటాడుకొన్నాయి. ఇక స్నేహమయిపోయింది గాబట్టి ఒకదాని మీద మరొకటిపడి చెలగాటాలాడాయి. ఇప్పుడవి గాఢ స్నేహితులు!...'రాము' వల్ల ఆవీధి వూరకుక్కలు గూడ మంచి జాతి పిల్లల్ని పెట్టాయి. 'రాము' యిప్పుడు గర్వంగా కొన్ని ప్రాణుల 'తండ్రి' అయింది.

ఇలా అనుకొంటూనే జగన్నాథం యింట్లోకి వెళ్ళాడు. ఇంట్లో మంగమ్మ సుగుణతో మాటాడుతోంది. సుగుణ, మొన్న రాత్రి పుల్లమ్మత్త తనమీద అన్న మాటలని మంగమ్మకి చెబుతూ కన్నీరు విడుస్తోంది. మంగమ్మ సుగుణని బుజ్జగిస్తోంది. జగన్నాథం సుగుణని చూశాడు గాని, ఆ పక్కనే మంగమ్మని చూడగానే కంగారు పుట్టి, సుగుణ కన్నీటిని గుర్తించలేకపోయాడు. జగన్నాథాన్ని చూడగానే మంగమ్మ మంచం మీంచి లేచి తనింటికి వెళ్లిపోయింది.

జగన్నాథం, మంగమ్మ వెళ్లిపోగానే మెల్లగా సుగుణదగ్గరికి వెళ్ళి మంచంమీద కూచొన్నాడు. ఏమీ మాటాడకండా తలొంచుకొని నేలని కాలుతో రాస్తున్నాడు. సుగుణ భర్తెక్కడ తన కన్నీటిని చూస్తాడో అని వెనక్కి తిరిగి కళ్లు తుడుచుకొని, అక్కణ్ణించి వెళ్లిపోబోయింది.

"సుగుణా" భర్త పిలుపుకి సుగుణ ఆగింది. "మనం తిరిగి రాజమండ్రి వెళ్ళిపోదాం?" అన్నాడు.

సుగుణ అప్పుడు తల తిప్పి భర్తకేసి చూసింది. ఆ ముఖాన్ని చూడగానే ఆశ్చర్యపోయింది. కళ లేదు. తన్ని చూడగానే కొంటెగా నవ్వే కళ్లు చల్లబడి నిరాశని వెల్లడిచేస్తున్నట్టున్నాయి. దగ్గరగా వచ్చి "ఏం?" అని అడిగింది.

అతను తలెత్తి భార్యముఖంలోకి చూసి, తన దృష్టి నలా ఆమె ముఖంలో నిలపలేక మంచంమీంచి లేచి చేతులు వెనక్కి కట్టుకొని యిటూ అటూ పచారుచేయడం మొదలుపెట్టాడు. "సుగుణ!......నామీద నీకేమయినా అనుమాన ముందా?" అన్నాడు మెల్లగా.

"ఏమిటి మీ రనేది?" గభుక్కున జగన్నాథం దగ్గరికొచ్చి రెండుచేతులు పట్టుకొని ఆపింది.

"నామీద నీకు అనుమానం లేదు?...... ఊళ్ళో ప్రతీవారు నన్ను అనుమానంగా చూస్తున్నారు."

"ఎందుకు?" గభుక్కున అనేసిందే గాని, భర్త అన్నమాటల అంతర్యాన్ని ఆమె గ్రహించకపోలేదు...అప్పుడే తన మీద లోకు లనుకొంటున్న మాటలుగూడ జ్ఞప్తికొచ్చాయి.

"ప్రతీవారూ, నాకూ మంగమ్మకీ ఏదో సంబంధముందన్నట్టు మాటాడుతున్నారు.. రేపటినించి మంగమ్మ నిక్కడికి రానివ్వకండా చేయలేవు?" అన్నాడు సుగుణ చేతులు పట్టుకొని బతిమాలుతున్నట్టు.

సుగుణ యిహ తన ఆరాటాన్ని దాచుకోలేకపోయింది. రేపటినించి యిక మంగమ్మని యిక్కడికి రానివ్వకండా చేయడం కాదు తను చేయవలసిన పని—రేపే బండిమీద మరో వూరు వెళ్లిపోవడం. లేకపోతే ఈ అజ్ఞానుల నూటిపోటీమాటలకి తలొగ్గవలసి వస్తుంది. ఆ అభిప్రాయాన్నే భర్తకి చెప్పింది. చివరికి తనమీద వాళ్లు మోపిన నిందని అతనికి చెప్పకండానే అక్కణ్ణించి వెళ్ళిపోయేలాగు భర్తని ఒప్పించింది.

రాత్రి సుగుణకి నిద్ర పట్టలేదు. పుల్లమ్మ, బుల్లెమ్మ, గైరమ్మ, పోలమ్మ, చివరికి చిన్నపిల్ల పార్వతి గూడ తన్ని దెప్పుతున్నట్టే భ్రమించింది. జగన్నాథంగూడ సరిగా కునుకు తియ్యలేదు. వీర్రెడ్డి తన్ని అనుమానంతో కర్ర పట్టుకొని బుర్ర బద్దలుగొట్టినట్టే కలలు కన్నాడు.

'రాము' మాత్రం ఏ చీకూ చింతా లేకండా సంతోషంగా ఆ వెన్నెల రాత్రిలో మిగతా కుక్కలతో ఆడుకొంది. కాని యజమాని మంచాన్ని మాత్రం విడిచిపెట్టేది కాదు. 'రాము' శబం చేసేప్పుడల్లా జగన్నాథం, మానవుడికీ, జంతువుకీగల అంతరాన్ని వితర్కించుకొంటూ లోలోనే నవ్వుకొన్నాడు. మానవుడికి ఆ నాలికని తిప్పి భాషని తయ్యారు చేసుకోగానే ఒక విధమయిన అజ్ఞానం, అసూయ, అనుమానం గూడ వాడిలో పుట్టాయి!

తెల్లవారిం తర్వాత జగన్నాథం బండి తీసుకొచ్చాడు. సామానంతా బండిలోకెక్కించి, సుగుణ, తల్లి బండిలోకి ఎక్కిం తర్వాత జగన్నాథంగూడ బండెక్కాడు. అంతలో జగ్గయ్యన్న వచ్చాడు.

"ఎక్కడికి బాబు ఈ ప్రయాణం?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

"కుక్కలు రాజ్యం చేసే దేశానికి" అని నవ్వుతూ జగన్నాథం సమాధానమిచ్చాడు.

పక్కనించిపోతున్న ఈరిగాడు, పోలప్ప నాయుడుతో "జగ్గయ్య ఆడి దగ్గర కాకాపట్టినట్టున్నాడు. ఆడి పంచ వొదల్టం లేదు" అంటూ యికిలించాడు.

అంత సరదాగా వుండే సుగుణ వెళ్ళిపోతోందని ము[illegible]కట తపి పెట్టుకొంది. పుల్లమ్మత్త మిగతా యిల్లాళ్లకో యిచిత్రాన్ని చూపించి "రంకు దింకెన్నాళ్లో పట్నం ముసుగుతో కులకాలనుకొందో? ఎళ్లిపోతోంటె ఎలా పక్కీగ్గా ఏడుస్తోందో!" అంది.

"మాతల్లి మాయమైపోతోంది. పట్నం కులుకంతా రావిగాడి మీద చూపించేసింది...ఇకనించైనా ఈ ఈది కుర్రోళ్ళు బాగుపడతారు" అంది నాయరాలు నారాయణమ్మ. బండి కదిలింది. రాము బండిని అనుసరించింది. కింద నడుస్తుందేగాని వెనకాలే వస్తున్న 'స్నేహితుల్ని' ఒక కంటితో చూస్తూ గెంతుతోంది. దానికి తెలీదు: తన యజమాని శాశ్వతంగా ఆ గ్రామాన్ని విడిచిపెట్టేస్తున్నాడని. మిగతా కుక్కలన్నీ గ్రామపొలిమేరవరకూ 'రాము' వెనకాలే సరసాలాడుకొంటూ వచ్చాయి. కాని 'రాము' యింకా అక్కడాగకండా ఎక్కడికో యింకా యింకా వెళ్ళిపోతుండడంతో యిక అక్కణ్ణించి కాలుకదపడానికి యిష్టపడక అక్కడే అలా వుండిపోయి 'కుంయ్యో' మంటూ కిందదొర్లుతూ ఏడ్చాయి.

★